# ఇంటి వద్దే ఈ-కేవైసీ

**గ్యాస్ వినియోగదారులకు ఊరట**



మహబూబాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : గ్యాస్ వినియోగదారులకు కాస్త ఊరట లభించింది. ఈ కేవైసీ కోసం వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం ఇక ఉండదు. వినియోగదారుల ఇంటి వద్దనే ఈ -కేవైసీని పూర్తి చేయాలని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు నిర్ణయించారు. ఇందుకోసం డెలివరీ బాయ్ సెల్ ఫోన్లలో ఈ-కేవైసీ యాప్‌ను డౌన్‌లోడ్ చేశారు. వారు వినియోగదారుడి ఇంటి వద్దనే సులువుగా ఈ కేవైసీ పూర్తి చేస్తున్నారు. యాప్‌లో గ్యాస్ నంబర్‌ను ఎంటర్ చేయగానే ఫోన్, గ్యాస్ నంబర్‌తోపాటు ఇంటి చిరునామా తదితర వివరాలు వస్తాయి. వెంటనే వినియోగదారుడి ఫొటో తీసీ అప్‌లోడ్ చేస్తారు. ఈ కేవైసీ సక్సెస్ ఫుల్ అని రిఫరెన్స్ నంబర్ వస్తుంది. ఇందుకోసం వినియోగదారులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.





## పిట్టల చెట్టు

మోడువారిన మానుకు కొత్తందం

ఆ చెట్టు చెప్పడో ఎండిపోయింది.. మోడువారిన కొమ్మలు మాత్రమే మిగిలాయి. ఎక్కడి నుంచి వచ్చిందోగానీ మంగళవారం ఓ పిట్టల గుంపు ఆ చెట్టు కొమ్మలపై వాలి పిట్టలే చెట్టుకు కాశాయా అన్నట్లుగా కనిపించాయి. హనుమకొండలోని బస్టాండ్ సమీపంలో ఈ 'పిట్టల చెట్టు' స్థానికులను ఎంతగానో ఆకర్శించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్





## వేల ఎకరాల్లో వేగంగా విస్తరణ

- పంటల దిగుబడి, పాడి పశువులపైనా ప్రభావం
- మనుషుల్లో ఊపిరితిత్తులు, చర్మవ్యాధులు సోకే ప్రమాదం
- ఇబ్బంది పడుతున్న రైతులు.. పూత దశలో నిర్మూలిస్తేనే మేలు

# వామ్మో.. వయ్యారిభామ !

### కలుపు మొక్కల్లో అత్యంత ప్రమాదకారి

**వయ్యారిభామ. ఇది అత్యంత ప్రమాదకరమైన కలుపు మొక్క. సాగుభూమిలోనే కాకుండా ఖాళీ స్థలాల్లో ఎక్కడచూసినా కనిపించే ఈ మొక్క ఇటు పంటలే కాదు, అటు పాడి పశువులు, మనుషుల ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపిస్తున్నది. దున్నినా, పీకేసినా నశించకుండా వేల ఎకరాలకు వేగంగా విస్తరిస్తుండడంతో నత్రజని స్థిరీకరణ తగ్గి పంటల దిగుబడి క్రమేపీ క్షీణిస్తున్నది. దీన్ని నివారించేందుకు రసాయనాలు చల్లాలంటే ఎకరానికి రూ.3వేలు ఖర్చుచేయాల్సి రావడం చిన్న, సన్నకారు రైతులకు కష్టమవుతున్నది. అయితే పూతకు రాని దశలోనే ఈ మొక్కలను నిర్మూలించడమే శాశ్వత పరిష్కారమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.**

వరంగల్, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వయ్యారిభామ(పార్థీనియం హిస్టిరోఫోరస్) ప్రమాదకర కలుపు మొక్క రైతులను ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా దెబ్బతీస్తున్నది. ఎక్కడ ఖాళీ జాగ ఉన్నా ఈ మొక్క ఉంటున్నది. దున్నినా, పీకి పారేసినా ఈ మొక్క నశించడం లేదు. సాగు భూముల మధ్యలో ఉండే గెట్లపైనా ఎక్కువగా మొలుస్తున్నది. ప్రతి సాగుభూమిలోనూ ఈ మొక్కలు ఉంటున్నాయి. పడావు భూముల్లో తీవ్రంగా ఉంటున్నది. వయ్యారిభామ కలుపు మొక్కను వ్యవహారికంగా కాంగ్రెస్ గ్రాస్ అని పిలుస్తారు. ఈ కలుపుమొక్క రోజురోజుకూ కొత్త భూముల్లోనూ విపరీతంగా విస్తరిస్తున్నది. కొద్దిపాటి పదను ఉన్నా ఈ మొక్క బాగా పెరుగుతుంది. దీన్ని నివారించి పంటలను కాపాడుకునేందుకు రసాయన మందుల కోసం ఎకరానికి రూ.3వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఖర్చు చేయలేని చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వయ్యారిభామ ఉన్న భూముల్లో నత్రజని స్థిరీకరణ తగ్గి పంటల దిగుబడి క్రమంగా తగ్గిపోతుంది. వయ్యారిభామ మొక్క మనుషుల ఆరోగ్యంపై, పంటలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. మనుషులకు ఊపిరితిత్తులు, చర్మవ్యాధులు సోకుతాయి. ఇండ్ల పెరడు, ఆటస్థలాల్లో ఈ మొక్కలు విపరీతంగా ఉండడంతో చిన్నపిల్లలు సైతం ఈ వ్యాధుల బారినపడుతున్నారు. వయ్యారిభామ మొక్క మనుషులకు, జంతువులకు అత్యంత ప్రమాదకారి అని ఈ విత్తనాలు మన దేశానికి వచ్చిన కొద్ది రోజులకే శాస్త్రవేత్తలు గుర్తించారు. వయ్యారిభామ వల్ల మనుషులకు కళ్ల మంట, విషజ్వరం, చర్మ, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తాయని తెలిపారు. పాడి పశువులు ఈ మొక్కను తింటే పాల ఉత్పత్తి తగ్గిపోతుంది.



#### అమెరికా పుణ్యమే

వయ్యారిభామ మొక్క 1975లో మన దేశంలో మొదటిసారి మొలిచింది. ఆహార కొరతతో ఇబ్బంది పడుతున్న మన దేశం అమెరికా నుంచి మేలు రకమైన గోధుమ విత్తనాలను దిగుమతి చేస్తున్నది. అమెరికా కంపెనీలు అక్కడినుంచి గోధుమ విత్తనాలను పంపేటప్పుడు ఉద్దేశపూర్వకంగానే వయ్యారిభామ విత్తనాలను కలిపి పంపించారు. అప్పుడున్న పరిస్థితుల్లో మన దేశంలో నాణ్యతాపరమైన నియంత్రణ చర్యలు అందుబాటులో లేవు. మన దేశానికి వచ్చిన వయ్యారిభామ విత్తనాలు గోధుమలతో పాటు విస్తారంగా సాగయ్యాయి. కొద్ది కాలంలోనే ఈ మొక్క విపరీతంగా విస్తరించింది. ఒక్క వయ్యారిభామ మొక్క 30వేల విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. మొక్క ఉన్న చోటు నుంచి గాలితో కిలోమీటర్ల దూరంలోని కొత్త ప్రాంతాలకు వ్యాపిస్తాయి. వరి మినహా అన్ని పంటల మధ్యలోనూ పెరుగుతుంది. వయ్యారిభామ మొక్కలు వేగంగా పెరుగుతాయి. పూతకు రాని దశలోనే ఈ మొక్కలను నిర్మూలిస్తేనే దీన్ని శాశ్వతంగా లేకుండా చేయవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలోని ఓ రైతు వ్యవసాయ భూమిలో వయ్యారి భామ మొక్కలు

#### ప్రమాదకరమైన మొక్క

వయ్యారిభామ అత్యంత ప్రమాదకరమైన కలుపు మొక్క. మొక్కల పువ్వులోని పరాగ రేణువులు గాలి ద్వారా మనుషుల ముక్కుల నుంచి ఊపిరితిత్తులకు చేరుతాయి. ఈ మొక్కతో పంటలకు చాలా తెగుళ్లు వస్తాయి. ఒక మొక్క నుంచి ఒకేసారి లక్షల సంఖ్యలో విత్తనాలు వస్తాయి. గాలితోనే కొత్త ప్రాంతాలకు విస్తరిస్తుంది. ఈ మొక్కను నేరుగా చేతితో ముట్టుకోవద్దు. ఇప్పటికే ఇది అదుపు చేయలేనంతగా విస్తరించింది. కొందరు, కొన్నిచోట్ల నిర్మూలిస్తే ఫలితం ఉండదు. ఒకేసారి క్రమపద్ధతిలో నిర్మూలిస్తే ఈ మొక్కలు శాశ్వతంగా అంతరించిపోతాయి. చాలామంది రైతులు జనవరి తర్వాత వయ్యారిభామ మొక్కలను పీకి మంటపెడతారు. దీని వల్ల ప్రయోజనం ఉండదు. పీకి పక్కన వేసినా అక్కడ విత్తనాలు పోగవుతాయి. పూతకు రాక ముందు మొక్కలను పీకి కాల్చి వేయాలి.

- రావుల ఉమారెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం



## రాష్ట్రపతికి మంత్రి సీతక్క కృతజ్ఞతలు

**గిరిజన యూనివర్సిటీ బిల్లును ఆమోదించినందుకు ధన్యవాదాలు**



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నమస్కరిస్తున్న మంత్రి సీతక్క, పక్కన గవర్నర్ తమిళిసై

ములుగు, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) కృతజ్ఞతలు తెలిపారు. శీతాకాల విడిదికి హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతిని మంగళవారం ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లాలో ఏర్పాటు చేయనున్న సమ్మక్క-సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయానికి సంబంధించిన బిల్లును ఆమోదించి చట్టబద్ధత కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతేడాది డిసెంబర్‌లో రాష్ట్రపతి రామప్పకు వచ్చిన సందర్భంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేయాలని కోరినట్లు చెప్పారు. యూనివర్సిటీ పనులు త్వరగా పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభించేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామని మంత్రి అన్నారు.

## భూ ఆక్రమణకు ప్రయత్నించిన భార్యాభర్తలపై కేసు

- కులం పేరుతో దూషించి దాడికి యత్నించిన అశోక్, విజయకుమారి
- నిందితులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే..గతంలోనూ వీరిపై భూకబ్జా ఆరోపణలు
- సహకరించిన మరో ఐదుగురిపైనా ఎస్సీ, ఎస్టీ కేసు

సుబేదారి, డిసెంబర్ 19 : భూ ఆక్రమణకు పాల్పడిన ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు హనుమకొండ సీఐ కరుణాకర్ తెలిపారు. గోపాల్‌పూర్‌కు చెందిన భూక్యా ఉమాదేవి 2019లో ములుగురోడ్డు - హనుమాన్ జంక్షన్ సమీపంలోని సర్వే నంబర్ 527లో 200 గజాల స్థలాన్ని పిన్నింటి సంపత్‌రావు నుంచి కొనుగోలు చేశారు. గత నెలలో ఇంటి పనులు ప్రారంభించారు. గత నెల 19న ప్లాట్ వద్దకు ప్రభుత్వ ఉద్యోగులైన బొంకూరి అశోక్, అతడి భార్య విజయకుమారి, మరో నలుగురు వచ్చి పనులను అడ్డుకున్నారు. ఉమాదేవిని, ఆమె భర్తను కులం పేరుతో దూషించి కర్రలతో దాడికి యత్నించారు. మరుసటి రోజు రాత్రి విజయకుమారి, అశోక్ ప్లాట్‌లో మట్టి పోసి ఆక్రమించడానికి ప్రయత్నించారు. బాధితురాలు ఉమాదేవి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నకిలీ పత్రాలతో ప్లాట్ ఆక్రమించుకోవడానికి ప్రయత్నించిన, కులం పేరుతో దూషించి, దాడికి యత్నించిన అశోక్, విజయకుమారి, సహకరించిన మరో నలుగురు వ్యక్తులు, టిప్పర్ యజమానిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. కాగా, భూ ఆక్రమణకు ప్రయత్నించిన విజయకుమారి, అశోక్ ప్రభుత్వ ఉద్యోగులు అని పోలీసులు తెలిపారు. అశోక్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో, విజయకుమారి విద్యా శాఖలో పని చేస్తున్నట్లు చెప్పారు. వీరిద్దరిపై గతంలో భూ ఆక్రమణల అరోపణలు ఉన్నట్లు తెలిపారు.







సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## సంక్షేమ ఘనత బీఆర్‌ఎస్‌దే

**కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నర్మెట, డిసెంబర్ 19: దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నర్మెటలోని వినాయక గార్డెన్‌లో నిర్వహించిన మండల స్థాయి కృతజ్ఞత సమావేశానికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేశ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. నీలిమ ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. శాసనసభ్యుడిగా తనకు వచ్చే వేతనాన్ని నియోజకవర్గ ప్రజల కోసం వెచ్చిస్తానన్నారు. విద్యుత్ సంస్థలపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ఆరోపణలు చేసున్నదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అని పల్లా వివరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు మర్చిపోవద్దన్నారు. ప్రగతిభవన్ అనేది సీఎం నివాసమని, దానిని ప్రజాభవన్‌గా మార్చారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ముళ్ల కంచెలు వేశారని, వాటిని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తొలగించారని పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, జడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు గద్దల నర్సింగరావు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్, బీఆర్‌ఎస్ నర్మెట, తరిగొప్పుల మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామిని శివరాజ్, నాయకులు జంగిటి అంజయ్య, నీరేటి సుధాకర్, ప్రజ్ఞాపురం అంజయ్య, ఆమెడపు కమలాకర్‌రెడ్డి, నర్ర వెంకటరమణారెడ్డి, బానోత్ రవి, కంతి రాజలింగం, మంకెన ఆగిరెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, పిట్టల రాజు, బావండ్లపల్లి రాజు, జాల కిషన్, పండుగ మల్లేశం, నక్కల రవి, జినుక రవి పాల్గొన్నారు.

## ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి

- సంక్షేమ పథకాలను కొనసాగించాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

రఘునాథపల్లి, డిసెంబర్ 19: ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, బీఆర్‌ఎస్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్‌ఎస్ రఘునాథపల్లి, లింగాలఘనపురం మండలాల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం యశ్వంతాపూర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై గ్రామాల వారీగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలిచ్చిన తీర్పు మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు అధికారంలో ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఆరు గ్యారంటీలకు డిసెంబర్ 9న చట్టబద్ధత కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు చెప్పారని గుర్తు చేశారు. రైతుల పంట రుణాలు రూ.2 లక్షలను మాఫీ చేస్తామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ. 2500, వంటగ్యాస్ రూ.500కే ఇస్తామని చెప్పారని తెలిపారు. వీటిలో కేవలం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే అమలు చేశారని శ్రీహరి వివరించారు. రైతులకు నేటికీ రైతుబంధు సాయం అందలేదని, ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య ఖర్చులకు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే రూ.5 నుంచి రూ.10 లక్షలు ఇస్తామని ఆనాడే చెప్పామని, ఇందులో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదన్నారు. హామీలు అమలు చేయలేని కాంగ్రెస్ పాలకులు కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రాన్ని అప్పులమయం చేశారని ఆరోపించడం సరికాదన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిని గుర్తించకుండా అసత్యాలు చెబుతూ శ్వేతపత్రాలు విడుదల చేస్తామంటున్నారని శ్రీహరి తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాల్లో విజయం సాధించేలా ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు గుడి వంశ్రీధర్‌రెడ్డి, బొల్లం అజయ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వారాల రమేశ్‌యాదవ్, బస్వగాని శ్రీనివాస్, ఎంపీపీ చిట్ల జయశ్రీ ఉపేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు మారుజోడు రాంబాబు, నాయకులు లోనె శ్రవణ్‌కుమార్, నామాల బుచ్చయ్య, గొరిగె రవి, బొల్లంపల్లి నాగేందర్, మడ్లపల్లి సునీత, ఉడుగుల భాగ్య, మాజీ ఎంపీపీ దాసరి అనిత, దేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి

## క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి

తొర్రూరు, డిసెంబర్ 19 : విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి జ్యోతి తెలిపారు. పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో అండర్-4, 17, 19 విభాగాల రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి పది జిల్లాల నుంచి 600 క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి, రాష్ట్ర పరిశీలకుడు అంతటి శంకరయ్య, జిల్లా క్రీడా కన్వీనర్ చెడుపల్లి ఐలయ్య తొలి రోజు బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ.. ధైర్యం ఉన్న వారే బాక్సింగ్‌లో రాణిస్తారని, ఈ ఆటకు నిరంతర సాధన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక పరిశీలకుడు పార్థసారథి, వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్, విజయ్‌చందర్, సత్యనారాయణ, కోచ్‌లు పాల్గొన్నారు.

## సంక్రాంతిలోగా పనులు పూర్తి చేయాలి

**మేడారాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి: ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి**



మ్యాప్ ద్వారా జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తాడ్వాయి, డిసెంబర్19 : మేడారం మహా జాతరలో భాగంగా చేపట్టే అభివృద్ధి పనులను సంక్రాంతి పండుగ లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మేడారంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మహా జాతర సమయం ముంచుకొస్తున్నదని, అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలన్నారు. అధికారులు మేడారంలో క్షేత్రస్థాయిలో ఉండి పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలన్నారు. ఏఈఈలు, డీఈలు మేడారంలో ఉంటూ పనులను ప్రారంభించాలని, ఈఈలు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో సందర్శించి పనుల పురోగతి ఫొటోలు గ్రూప్‌లో పోస్ట్ చేయాలన్నారు. ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా నిర్వహించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని కలెక్టర్ చెప్పారు. వ్యాపారులకు ప్లాస్టిక్ కవర్లపై అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యామ్నాయ వస్తువులు ఎక్కడ దొరుకుతాయి, ఎంతలో దొరుకుతాయి అనే వివరాలు తెలిసేలా ప్రదర్శించాలని తెలిపారు. అనంతరం ఊరట్టం, చిలుకలగుట్ట ప్రాంతంలో పార్కింగ్ ఏర్పాటుకు కలెక్టర్ స్థలాన్ని పరిశీలించారు. సమావేశంలో మేడారం జాతర కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, డీపీవో వెంకయ్య, డీఎంహెచ్‌వో అప్పయ్య, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. అలాగే మేడారంలోని గిరిజన మ్యూజియాన్ని ఐటీడీఏ పీవో అంకిత్ సందర్శించారు. తల్లులను దర్శించుకునేందుకు కోటి మంది భక్తులు రానున్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సందర్శకులకు ఆహ్లాదం కలిగేలా మ్యూజియం ఆవరణలో గార్డెన్ ఏర్పాటు చేయాలని, రంగులు వేయాలని, మైనర్ రిపేర్ చేపట్టాలని గిరిజన సంక్షేమశాఖ ఈఈ హేమలతను ఆదేశించారు. మ్యూజియంలోని పరికరాలు, పనిముట్ల వివరాలు తెలిసేలా కీవోస్ ఏర్పాటు చేయాలన్నారు.

#### జాతరలో విద్యుత్ సమస్యలు రానివ్వం

జాతరలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్పీడీసీఎల్ డీఈ పులుసం నాగేశ్వర్‌రావు తెలిపారు. ఇప్పటికే నిరంతర విద్యుత్ సేవల కోసం డిసెంబర్ మొదటివారంలోనే పనులను ప్రారంభించామని, 50శాతం పనులు పూర్తయ్యాయన్నారు. 315కేవీఏ కెపాసిటీ గల డీటీఆర్‌లను ఏర్పాటు చేసే పనులు పూర్తయ్యాయని, వరి కోతలు పూర్తి కాగానే మిగతా పనులు ప్రారంభించి జనవరి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ బస్టాండ్, చిలుకలగుట్ట, జంపన్నవాగు, గద్దెల పరిసరాల్లో డీటీఆర్‌లను ఏర్పాటు చేశామన్నారు. జాతరలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా మొత్తం 200 డీటీఆర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జాతర అభివృద్ధి నిధులు విడుదల కాకపోయినా తమ సంస్థ నిధులు ఖర్చు చేస్తూ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వివిధ శాఖల అధికారులు పార్కింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు కోరిన చోట్ల విద్యుత్ సరఫరాకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.